ప్రజాశక్తి

గురువారం 24 జులై 2025





శ్రీనివాసరావు మృతదేహంవద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పిడుగుపడి రైతు మృతి

మరొకరికి అస్వస్థత

రేగిడి మండలం వెంకట రంగరాయపురానికి చెందిన రైతు ఆలబోయిన శ్రీనివాసరావు (45) బుధవారం పొలంలో పనిచేస్తుండగా పిడుగు పడి మృతి చెందాడు.

(వివరాలు మెయిన్‌లో)

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన ప్రవేశాలు

- ప్రైవేటు బడులకు పెరిగిన విద్యార్థులు
- ప్రభుత్వ విధానాలే కారణం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తరగతి గదిలో అరకొరగా ఉన్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా తగ్గుతోంది. అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ బడులకు బారులు తీరుతున్నారంటూ ప్రభుత్వ పెద్దలు, అధికారులు చెబుతున్న ప్రచారానికి భిన్నమైన పరిస్థితి క్షేత్రస్థాయిలో కనపడుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ ఏడాది ఇప్పటి వరకు ఒకటో తరగతిలో చేరిన వారు కేవలం 6921 మంది మాత్రమే ప్రభుత్వ బడుల్లో చేరారు. గత ఏడాది ఇదే సమయానికి 7459 మంది చేరారు. దీనంతటికీ ప్రభుత్వ విధానాలే కారణంగా కనిపిస్తున్నాయి.

జిల్లాలో గతంలో ఏటా సుమారు 30వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవారు. ఇటీవల కాలంలో ఏటా ఈ సంఖ్య తగ్గుతూ వస్తోంది. బడి మధ్యలో మానేసిన వారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తుంది. గత ఏడాది కంటే ప్రైవేటు కార్పొరేట్ స్కూళ్లో చేరిన వారి సంఖ్య ఈ ఏడాది బాగా పెరిగింది. ప్రైవేటు పాఠశాలల్లో 18152 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం చేరారు. దీనంతటికీ ప్రభుత్వ విధానాలే కారణంగా కనిపిస్తున్నాయి. జిల్లాలో ఉన్న 1717 ప్రభుత్వ పాఠశాలల్లో 1 వ తరగతి నుంచి పదో తరగతి వరకు 1,16,799 మంది ఉంటే 500 పైగా ఉన్న ప్రయివేటు పాఠశాలల్లో 2,12,926 మంది విద్యార్థులు ఉన్నారు.

గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న విద్యాసంస్కరణలు ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాలల విలీనం వల్ల గ్రామాల్లో చాలా చోట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. 3, 4, 5 తరగతులను కిలోమీటర్ల అవతల ఉన్న పాఠశాలలకు పంపడం వల్ల అక్కడ 1, 2 తరగతులే మిగులుతున్నాయి. దీంతో 1, 2 తరగతుల విద్యార్థుల సంఖ్య 10 నుంచి 15 లోపే ఉండటంతో అవి ఏకోపా ధ్యాయ పాఠశాలలుగా మారుతున్నాయి. దీంతో పాఠశాలలకు పంపేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. మరోపక్క అమ్మఒడి, తల్లికి వందనం పథకాలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కూడా అమలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అమాంతంగా పడిపోతోంది. ఆ డబ్బులతో ప్రైవేటు పాఠశాలల్లో చదివించు కోవచ్చనే భావన తల్లిదండ్రుల్లో ఏర్పడుతోంది. మరోవైపు రాష్ట్రప్రభుత్వం 9 రకాల పాఠశాలల విధానం పెట్టడంతో తరగతుల విలీనం కావడంతో దూరంగా ఉన్న పాఠశాలలకు తల్లిదండ్రులు పంపలేక పోతున్నారు. ఈ విద్యార్థులను ప్రైవేట్ యాజమాన్యాలు బస్సు పెట్టి మరీ తమ పాఠశాలల్లో చేర్చుకుంటున్నాయి. దీంతో ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. ఇంకోవైపు మండల కేంద్రాల్లో హాస్టళ్లలో ఉంటూ హైస్కూళ్లలో విద్యార్థులు చదువుకుంటున్నారు. పలుచోట్ల వసతిగృహాలు శిథిలావస్థకు చేరుకోవడంతో అందులో ఉండలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు మానేసి తమ గ్రామాలకు దగ్గరలోగల ప్రైవేటు స్కూళ్లలో చేరుతున్నారు.

మండలాల వారీగా ఈ ఏడాది పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య

మండలం	ప్రభుత్వ	ప్రైవేటు
బాడంగి	146	86
భోగాపురం	312	277
బొబ్బిలి	370	1018
బొండపల్లి	264	212
చీపురుపల్లి	299	315
దత్తిరాజేరు	159	110
డెంకాడ	215	416
గజపతినగరం	174	294
గంట్యాడ	200	260
గరివిడి	311	294
గుర్ల	303	103
జామి	183	288
కొత్తవలస	187	629
ఎల్ కోట	160	126
మెంటాడ	223	83
మెరకముడిదాం	217	173
నెల్లిమర్ల	250	486
పూసపాటిరేగ	378	620
అర్.ఆమదాలవలస	325	30
రాజాం	265	989
అర్ బి పురం	271	144
సంతకవిటి	269	166
ఎస్. కోట	243	631
తెర్లాం	235	214
వంగర	130	37
వేపాడ	171	58
విజయనగరం	660	3153
మొత్తం	6921	18152

బంగారు కుటుంబాల దత్తత

పారిశ్రామికవేత్తలకు కలెక్టర్ అంబేద్కర్ పిలుపు



ప్రజాశక్తి-కంటోన్మెంట్

పేదరిక నిర్మూలనే పి4 కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పష్టం చేశారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకు రావడానికి పారిశ్రామిక వేత్తలు మార్గదర్శులుగా ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. పి4 విధానం, బంగారు కుటుంబాలు, మార్గదర్శుల పాత్రపై జిల్లాలోని పారిశ్రామిక వేత్తలకు కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ పి4 కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. రాష్ట్రంలో సున్నా పేదరికమే లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రూపొందించారని వివరించారు. ఇప్పటివరకు పారిశ్రామిక వేత్తలు సిఎస్ఆర్ ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేశారని అన్నారు. ఇకనుంచి పేద కుటుంబాలను వ్యక్తిగతంగా దత్తత తీసుకొని, పేదరికం నుంచి వారు శాశ్వతంగా బయట పడేవిధంగా చైతన్య పరచడం, అవసరమైన విద్య, ఇతరత్రా సహకారాన్ని అందించడం చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 60,067 పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామని, వారిని దత్తత తీసుకొనేందుకు మార్గదర్శులు ముందుకు రావాలని కోరారు. బంగారు కుటుంబాల తుది జాబితాను తయారు చేసేందుకు ఈ నెల 18 నుంచి ఆగస్టు 5వరకు మరోమారు గ్రామసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మార్గదర్శులు తమకు నచ్చిన ప్రదేశం నుంచి దత్తత తీసుకోవచ్చునని కలెక్టర్ సూచించారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ కరుణాకర్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్, ఫోమ్ బోర్డులు నిషేధం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ప్లాస్టిక్, ఫోమ్ బోర్డులు వంటివి నిషేధించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. అనధికారికంగా ప్రతి ఇంటి గేటుకు అమర్చిన ప్లాస్టిక్ ప్రకటిత బోర్డులను కమిషనర్ ఆదేశాల మేరకు ప్రణాళిక సిబ్బంది తొలగించారు. 41వ నెంబర్ సచివాలయ పరిధిలో ఇందు నిమిత్తం ప్రత్యేక పర్యవేక్షణతో ప్లాస్టిక్ బోర్డులను,ఫోమ్ బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పర్యావరణానికి విఘాతం కలిగించడంతో పాటు ఇళ్ళ యజమానులకు అసౌకర్యాన్ని కల్పిస్తూ ఇంటి ముందు గేట్లకు పలువురు ప్లాస్టిక్ బోర్డులను అతికిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అయితే వాటిని అమర్చేందుకు ఇటు నగరపాలక సంస్థ అధికారుల అనుమతి గానీ, కనీసం ఇంటి యజమాని సమ్మతి గానీ తీసుకోకుండా ప్లాస్టిక్ బోర్డులను అతికిస్తున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. అందువలన నగరంలో ఇటువంటి ప్లాస్టిక్ ఫోమ్ బోర్డులను నిషేధిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్, ఫోమ్ బోర్డులు అతికించినట్లు గుర్తిస్తే వెంటనే సదరు బోర్డుపై ఉన్న నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.



లక్ష్మీసెహగల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రెడ్డి శంకర్రావు, ఐద్వా నాయకులు

పోరాట యోధురాలు లక్ష్మీ సెహగల్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వాతంత్ర్య సమర యోధు రాలు, ఆజాద్ హిందు ఫౌజ్ ఏర్పాటు చేసిన ఇండియన్ ఆర్మీ ఝాన్సీ రేంజ్‌కు కెప్టెన్ గా వ్యవహరించిన లక్ష్మి సెహగల్ 13 వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఎల్‌బిజి నగర్ లో ఐద్వా ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముందుగా లక్ష్మీసెహగల్ చిత్రపటానికి పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో శంకర్రావు మాట్లాడుతూ దేశ స్వాతంత్యం కోసం, మహిళా హక్కుల కోసం, సమసమాజ సాధనే లక్ష్యంగా పోరాడిన ధీర వనిత లక్ష్మి సెహగల్ అని అన్నారు. స్వతహాగా డాక్టర్ అయిన లక్ష్మి సెహగల్ జీవితాంతం మహిళల హక్కులు కోసం పోరాడారని, ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులుగా పనిచేశారని తెలిపారు. ఆమె సేవలకు గుర్తుగా పద్మశ్రీ అవార్డు ఇచ్చి కేంద్రం సత్కరించిందన్నారు. ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం రాష్ట్రపతిగా అబ్దుల్ కలాంపై వామపక్ష అభ్యర్థిగా పోటీ చేశారన్నారు. 2012 లో మరణించినంత వరకు ప్రజా సేవలో ఉన్నారని తెలిపారు. సదస్సుకు ముందు ఎక్కడమ్మా నువ్వులేనిది నాటిక, అధిక ధరలు పైన ప్రదర్శించిన వీధి నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి.

జనసేన ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ కొణిదల పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా ఈనెల 24న విడుదల నేపథ్యంలో నగరంలో జనసేన నాయకులు అవనాపు విక్రమ్ ఆధ్వర్యంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆ సినిమా ప్రమోషన్ లో భాగంగా ఈ ర్యాలీ చేపట్టినట్లు అవనాపు విక్రమ్ తెలిపారు. హిమగిరి థియేటర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, పిడబ్ల్యూటి మార్కెట్, ఎస్ బి ఐ మెయిన్ బ్రాంచ్, కన్యకా పరమేశ్వరి ఆలయం, గంట స్తంభం, మూడు లాంతర్లు, కోట జంక్షన్, సింహాచలం మేడ, అంబేద్కర్ జంక్షన్ ల మీదగా హిమగిరి థియేటర్ వద్దకు చేరుకుంది. అంతకుముందు మీడియాతో విక్రమ్ మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో భాగమైన కొన్ని అంశాలను కథా వస్తువులగా తీసుకొని తీర్చి దిద్దిన సినిమా హరిహర వీరమల్లు అని అన్నారు.కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో శక్తి వారియర్ బృందాలు

అదనపు ఎస్‌పి సౌమ్యలత

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పాఠశాలలు, కళాశాలల్లో శక్తి వారియర్ బృందాలను నియమించాలని ఎఎస్‌పి పి.సౌమ్యలతో ఆదేశించారు. జిల్లాలో ప్రజలకు, మహిళలకు భద్రత, శక్తి యాప్ పట్ల అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్‌ల పనితీరును ఎఎస్‌పి పోలీసు కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మహిళల భద్రత, శక్తి ఎస్‌ఒఎస్ యాప్ పట్ల అవగాహన కల్పిస్తున్న టీమ్‌లను వృత్తిపరమైన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో గస్తీ తిరగాలని, పాఠశాలలు, కళాశాలలను సందర్శించి విద్యార్థులకు శక్తి యాప్, పోక్సో చట్టం, మాదక ద్రవ్యాల అనర్థాల గురించి వివరించాలన్నారు. ఆపద సమయంలో శక్తి ఎస్‌ఒఎస్ కాల్స్ చేసి ఏ విధంగా రక్షణ పొందవచ్చునో, సేఫ్ ట్రావెల్ ఏ విధంగా వినియోగించవచ్చునో వివరించాలన్నారు. శక్తి వారియర్స్ బృందాలను నియమించాలని, అందులో ఒక ఉపాధ్యాయుడు, యాక్టివ్‌గా ఉండే ఐదుగురు విద్యార్థినులు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థినులకు స్వీయ రక్షణపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసుస్టేషన డిఎస్‌పి ఆర్.గోవిందరావు, సిఐ ఇ.నర్సింహమూర్తి, ఎస్‌ఐలు శిరీష, దేవి, సాగర్‌బాబు, గోపాలరావు, శక్తి బృందం సభ్యులు పాల్గొన్నారు.

నాసిరకం మద్యంతో పేదల ప్రాణాలు తీశారు

- మద్యం కంపెనీల నుంచి భారీగా ముడుపులు
- బొత్స అసత్య ప్రచారాలు మానుకోవాలి
- టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున



తల్లికి వందనం అందడం పట్ల సభలో హర్షం వ్యక్తం చేస్తున్న మహిళ

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపి హయాంలో మద్యం అమ్మకాల్లో భారీ కుంభకోణం జరిగిందని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో బుధవారం నాగార్జున విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో నాసిరకం కల్తీ మద్యం తాగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో భాగస్వాములైన అందరిపైనా మర్డర్ కేస్ నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంపి మిథున్ రెడ్డి అరెస్టు అన్యాయం అంటూ వైసిపి నాయకులు ప్రకటన చేయడం సిగ్గుచేటు అన్నారు. గత ఐదేళ్లలో డబ్బులు సంచులు వైసిపి నాయకులుకు రావడానికి నాసిరకం మద్యాన్ని అమ్మకాలు చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రెసిడెంట్ మెడల్, గుడ్ మార్నింగ్, గుడ్ నైట్ లాంటి బ్రాండ్ల మద్యనే అమ్మకాలు చేసి పేదల ఆరోగ్యాన్ని నాశనం చేశారన్నారు. ఇలాంటి భారీ కుంభకాణాలకు పాల్పడితే ఎందుకు అరెస్టు చేయరని ప్రశ్నించారు. మాజీమంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు జిల్లావ్యాప్తంగా జరిగిన వైసిపి సభల్లో పాల్గొని అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. ఉనికి కాపాడుకోవడానికి సభలు నిర్వహించి లేనిపోని ప్రకటనలు చేస్తున్నారన్నారు. వైసిపి హయంలో రాష్ట్రాన్ని ఆర్థికంగా పూర్తిగా సర్వనాశనం చేసినప్పటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్లో 30 ఎకరాలు 10 లక్షలకు తీసుకున్న సంపన్నులు ఎవరని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 1600 మంది ఉపాధ్యాయుల అక్రమ బదిలీలకు ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షలు నుంచి రూ.7 లక్షలు వసూలు చేసింది ఎవరని ప్రశ్నించారు. వాటికి సమాధానం చెప్పకుండా కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం బాధాకరమన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం 2, 3, 4వ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా 3 వ డివిజన్‌లో వ్యాసన్నారాయణ మెట్ట ఎదురుగా పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం పూల్ బాగ్‌కాలనీ ఆటో జంక్షన్ వద్ద సమావేశం నిర్వహించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వి పి రాజు, టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ , ఎఎంసి చైర్మన్ కర్రోతు నర్సింగరావు, పార్లమెంట్ మహిళ ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం తదితరులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలని స్కూలు ఆయాల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న శానిటేషన్ వర్కర్లు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు (ఆయాలు)పై పని భారం తగ్గించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో విజయనగరం ఎంఇఒ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి వై.నందిని, సిఐటియు నగర అధ్యక్షులు ఎ. జగన్మోహన్రావు మాట్లాడుతూ పార్ట్ టైం వర్కర్లని చెప్పి ఫుల్ టైం పని చేయి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తారు. ఉపాధ్యాయుల కంటే ముందుగా పాఠశాలకు వెళ్లి తరగతి గదులు శుభ్రం చేసి , సాయంత్రం ఉపాధ్యాయులు వెళ్లిన తర్వాత తలుపులకు తాళాలు వేసి ఇంటికి వెళ్తున్నామని , బాత్రూం లు, మరుగుదొడ్ల పరిశుభ్రత తో పాటు తరగతి గదుల క్లీనింగ్ , రికార్డులు అందించడం వంటి పనులు రోజంతా చేస్తున్నారని, ఫుల్ టైం వర్కర్లు గా గుర్తించి కనీసం రూ.12వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలలో కనీసం 2సెలవులు మంజూరు చేయాలన్నారు. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు, తరగతి గదులు, పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చీపుర్లు, ఫినాయిల్, బ్లీచింగ్ వంటి సామగ్రి, చెప్పులు, యూనిఫామ్ తదితర రక్షణ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పార్వతి, ఉమా,తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐల్లో రెండో విడత ప్రవేశాలకు నేడు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వ ఐటిఐల్లో మొదటి దశలో మిగిలి ఉన్న సీట్లకు రెండో విడతు ప్రవేశాలకు ఈనెల 24న ఉదయం 9గంటల నుంచి విజయనగరం ప్రభుత్వ ఐటిఐలో కౌన్సిలింగ్ జరుగుతుందని ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, ధ్రువపత్రాల పరిశీలన చేసుకున్న అభ్యర్థులకు మెరిట్‌జాబితా ప్రకారం కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు పదో తరగతి జిపిఏ మార్కులు ఆధారంగా కేటాయించిన ర్యాంకులను బట్టి గురువారం ఉదయం 9గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థుల మొబైల్ నెంబర్‌లకు వారి ర్యాంకు, హాజరు కావాల్సిన కౌన్సిలింగ్ తేదీని మెసేజ్ ద్వారా తెలియజేశామని తెలిపారు



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విఫలం

- కూటమి హామీలు అమలు కానందునే డైవర్షన్ పాలిటిక్స్
- వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కానందునే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

ప్రజలకిచ్చిన హామీల అమల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం.. దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు చేపడుతున్న కక్ష సాధింపు చర్యలకు దిగుతోందన్నారు. హామీలేవీ అమలు కావడం లేదన్నారు. ఏం అమ్మాలనుకొని ఆరోజు టిడిపి నాయకులు హామీలు ఇచ్చారని వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్నాయుడును ప్రశ్నించారు.రైతులకు సకాలంలో ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా జిల్లా మంత్రికి పట్టడం లేదన్నారు. రైతుల భరోసా ఇవ్వలేదని, మరోవైపు తల్లికి వందనం అర్హులందరికీ అందలేదని అన్నారు. ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందడం లేదన్నారు. బాడంగి సిహెచ్‌సిలో ప్రయివేటు ల్యాబ్‌రేటరీలు నడుపుతున్న దారుణ పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం, చంద్రబాబు ప్రజలను మోసం చేసిన తీరును ఎప్పటికప్పుడు ఎండగట్టి ప్రజలకు అండగా నిలబడుతున్నామని తెలిపారు. . ప్రజల తరపున వైసిపి చేస్తున్న పోరాటాలను చూసి ఓర్వలేకే రకరకాల స్కామ్‌లను తెరపైకి తీసుకుని వచ్చి వాటిని వైసిపి నాయకులపై రుద్దే కార్యక్రమం చేస్తోందని విమర్శించారు. లేని లిక్కర్ స్కాంతో ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తుందన్నారు. ఏడాది కూటమి పాలనలో మద్యం ఏరులై పారుతుందన్నారు కూటమి ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా అరెస్టులకు భయపడేది లేదన్నారు. ప్రజల తరపున తమ పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో వైసిపి నాయకులు నెక్కల నాయుడు బాబు, కనకల రఘు రామారావు, పీరుబండి జైహింద్ కుమార్ పాల్గొన్నారు

సహకారశాఖ సిబ్బందికి స.హ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్ర సమాచార కమిషనర్, రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా సహకార శాఖ అధికారులు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని ఆ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా సహకార అధికారి పి.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.వాణి శైలజ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టానికి సంబంధించి వస్తున్న అర్జీలపై మన శాఖ ద్వారా ఇస్తున్న సమాచారంపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. అర్జీలను చదివి, పూర్తిగా అవగాహన చేసుకొని వాటికి తగిన సమాచారం ఇచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉ ండగలుగుతామని కాబట్టి అందరూ చట్టంపైన పూర్తి విషయాలు తెలుసుకోవడానికి అందరూ ప్రయత్నం చేయాలని ఆయన కోరారు. సదస్సులో డివిజనల్ సహకార అధికారి ఎస్ రామమూర్తి, జిల్లా సహకార ఆడిట్ అధికారి బి.సన్యాసినాయుడు, ఇతర సహకార ఉద్యోగులు అందరు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా సహకార అధికారి రమేష్

సెంచూరియన్‌లో క్రీడా సౌకర్యాలు భేష్!

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో క్రీడా సౌకర్యాలు చాలా బాగున్నాయని హైదరాబాదులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. శ్రీధర్ కితాబునిచ్చారు. బుధవారం ఆయన సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా క్రికెట్‌లో మెలకువలు గురించి వివరించారు. బ్యాటింగ్ టెక్నిక్స్, ఫాస్ట్ బౌలింగ్, స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొనడం తదితర అంశాలను వివరించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పికె మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆరిఫ్ వర్మ, డాక్టర్ శ్రీధర్‌ను సత్కరించారు.

పాఠశాలలను సందర్శించిన మానిటరింగ్ కమిటీ

ప్రజాశక్తి- చీపురుపల్లి

మండలంలోని పాఠశాలలను అకాడమిక్ మానిటరింగ్ కమిటీ బుధవారం సందర్శించింది. ప్రధానంగా చీపురుపల్లి పంచాయతీ పరిధిలోని వంగపల్లిపేట, బజారు స్కూల్, రామాంజనేయ స్ట్రీట్ స్కూల్‌ను ఈ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, తరగతి సమయపట్టిక, సిలబస్, ఆచరణాత్మక సెషన్లు, విద్యా నాణ్యత, సమస్యలు వంటి వాటిని పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కమిటీ పరిశీలించింది. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కామారి అన్నారావ్, రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సోంపురం, అరిగిపాలెం పాఠశాల్లో చదువుతున్న 1,2,3,4,5 తరగతుల విద్యార్థులకు ఎస్‌కోటకు చెందిన సాయి దివ్యామృతం వారిచే ఉచితంగా 240 నోట్ పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో సోంపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం బిపిఎ రాజు, జి.పట్టాలు, వెంకటరమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- వేపాడ



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపిటిసి తులసీ

మండలంలోని బల్లంకి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఎంపిటిసి గొంప తులసీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధనుంజయ, గ్రామ పెద్దలు కనకరాజు, ఎంఇఒ బాలభాస్కరరావు, యూనియన్ నాయకులు అర్జున్‌రావు, సిఆర్‌పి కె. రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి ప్రహరీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండల కేంద్రంలోని పుణ్యగిరికి వెళ్లే రహదారిలో గిరిజన బాలికల కళాశాల వసతి గృహానికి ప్రహరీ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీనివాసరావుకు విద్యార్థులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పి.రత్న మాట్లాడుతూ ఈ బాలికల వసతి గృహం ప్రారంభించి ఆరు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ ప్రహరీ నిర్మాణం చేయలేదన్నారు. దీని వల్ల బయట వ్యక్తులు వచ్చి హాస్టల్లో మద్యం తాగి సీసీలు విసరడం వంటి పనులతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వసతి గృహానికి ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి. చినబాబు, జిల్లా కమిటీ సభ్యులు వి. భారతి, పి. రత్న, మండల కమిటీ సభ్యులు జి. అనిత, శీల, శ్రీజ, వసతి గృహ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

వ్యవసాయానికి నిరంతరం విద్యుత్తు ఇవ్వాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో పలు చోట్ల గ్రామాల్లో విద్యుత్తు అధికాలు మరమ్మతులు పేరిట విద్యుత్తు కోతలు అమలు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ముఖ్యంగా వరినాట్లు జరుగుతున్న సమయంలో విద్యుత్తు నిలిపివేయడం తగదని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉబాలు వేయడానికి, దమ్ము పట్టడానికి ట్రాక్టర్, కూలీలును తీసుకు వచ్చిన తరువాత విద్యుత్తు లేని కారణంగా వెనుదిరిగాల్సి వస్తుందన్నారు. నిరంతరం విద్యుత్తు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం వరి నాట్లు సమయంలో ఇలా కోతలు విధించడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత సీజన్‌లో వరినాట్లకు విద్యుత్ సరఫరా చేయకపోతే సబ్ స్టేషన్‌ను రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు.

గ్రామాల్లో గంజాయి సమాచారమివ్వాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

గ్రామాల్లో గంజాయి, వినియోగం, రవాణా సమాచారాన్ని అందించాలని ఎస్ఐ బి.గణేష్ సూచించారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మహిళ సంరక్షణ పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో యువత గంజాయి బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందిరైనా ఉందన్నారు. యువత గంజాయికి బానిస కాకుండా అవగాహన సదస్సులు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి- కొత్తవలస

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్‌విఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో 436 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని ఇందులో 15 మందికి కళ్లద్దాలు అవసరమని ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఈశ్వరరావు తెలిపారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం బివి గోవిందరాజు ఆధ్వర్యంలో అక్కడ 215 మందికి తనిఖీ చేయగా 12 మంది విద్యార్థులకి కళ్లద్దాలకి ఎంపికయ్యారన్నారు. వీరికి రెండు నెలల్లో కళ్లద్దాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అనంతం పిల్లలకి హెల్త్ అసిస్టెంట్ సత్యారావు పౌష్టికాహారం పై వివరించారు. విటమిన్ ఏ సంబంధిత క్యారెట్, బీట్‌రూట్, బొప్పాయి, ఆల్‌గ్రీన్‌లీఫీ వెజిటబుల్స్ తినాలని, జంక్ ఫుడ్స్ తినరాదని, రోజుకి 7నుండి 9 గంటలు నిద్ర అవసరం అని, సెల్ ఫోన్ ఎక్కువ వాడరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మీ, స్టాఫ్ నర్స్ దీప, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు నేర్పించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యార్థులకు ఉపాధ్యాయులు నైతిక విలువలు నేర్పించాలని పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువలు పెంచేలా బోధన చేయకపోవడంతో గాడి తప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని పాఠశాలల్లో బాలికలను ఉపాధ్యాయులు వేధిస్తున్నారని ఆందోళన చెందారు. విద్యార్థులపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

60 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని శ్రీప్రసన్న సర్జికల్ నర్సింగ్ హెూమ్ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 60 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి వీరిలో నలుగురిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కంటి వైద్య శిబిరంలో ఆప్తాలజిస్ట్ డాక్టర్ అపూర్వ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కే దివ్య ప్రశాంతి, వై వాసు, ఎం దేవి, డి ఇందు, భార్గవి, సిహెచ్ జగన్మోహన్, శంకర్ ఫౌండేషన్ మేనేజర్ చంద్రశేఖర్ ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ శేఖర్ అపర్ణ సహకారంతో నిర్వహించారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎపిఎస్ ఆర్‌టిసిలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్ కలిగి ఒక సంవత్సరం అనుభవం ఉన్న 21సంవత్సరాలు నిండిన వారు ఈ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణ 40 రోజుల పాటు వుంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382924030, 9866649336 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

సారికలో రూ.36లక్షలతో అభివృద్ధి పనులు

వాటర్ ట్యాంకు పునర్నిర్మాణం ● కాలనీల్లో నాలుగు సిసి రహదారులు



సుందరంగా కాలనీ ముఖ ద్వారం



కొత్తగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకం

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం మండలంలోని సారిక గ్రామంలో సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు ఆధ్వర్యాన రూ.36లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి సహకారంతో గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ ఈశ్వరరావు తెలిపారు. గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకును మరమ్మతులు చేపట్టి, కొత్తగా మెట్లు ఏర్పాటు చేసి రంగులు వేయించారు. ఈ ట్యాంకు ద్వారా పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్ఆర్ఇ జిఎస్ నిధులతో శ్మశాన వాటికకు రహదారి నిర్మాణం చేపట్టారు. జగనన్న కాలనీకి 30లక్షల నిధులతో నాలుగు సిసిరోడ్లు నిర్మించారు. దీంతో గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రజాశక్తి తో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తామన్నారు. ప్రజల సహాయ సహకారాలతో గ్రామం రూపు రేఖలు మార్చుతున్నామని సర్పంచ్ ఈశ్వరరావు తెలిపారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. బుధవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో పోటీలను జిల్లా అసోసియేషన్ నాయకులు కొండపల్లి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తో పాటు కార్యదర్శి సున్నా సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర పోటీలకు ముందుగా జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర పోటీలకు పంపుతామన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ లో పోటీలు జరగనున్నాయి. అసోసియేషన్ నాయకులు,క్రీడాకారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి- రాజాం

స్థానిక ప్రభాకర్ స్కూల్లో బుధవారం అగ్నిమాపక సిబ్బంది ఫైర్ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజాం అగ్నిమాపక అధికారి పి.అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ మేరకు కరెంట్ ఫైర్, గ్యాస్ ఫైర్, వంట చేసినప్పుడు వచ్చిన మంటలు అరికట్టే విధంగా తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, స్కూల్ ప్రిన్సిపాల్ సోమేశ్వరీ, విద్యార్థులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పులపై ఫిర్యాదు

- ఒకరి భూమి ఇంకొకరికి నమోదు
- అమ్ముడుపోయిన రెవెన్యూ సిబ్బంది
- తహశీల్దార్‌కు వినతి పత్రం

ప్రజాశక్తి- దెంకాడ

భూముల రీ సర్వే చేస్తే రైతులకు బాగుంటుందని, ఎవరు భూమి వారి పేరుమీద వస్తుందని, అలాగైతే రైతులకు ఇబ్బందులు రావన్న నిర్ణయంతో ప్రభుత్వం రీ సర్వే చేయడం మొదలు పెట్టింది. అందులో భాగంగా ఇటీవల మండలంలోని మోదవలస రెవెన్యూ పరిధిలో రీసర్వే ప్రారంభించి పూర్తి చేశారు. అయితే ఒక రైతు భూమిని రీ సర్వేలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ మాయాజాలంతో ఇంకో ఇద్దరు రైతులు పేరుమీద సుమారు రెండు కోట్లు విలువ చేసే 50 సెంట్లు భూమిని డబ్బులకి అమ్ముడుపోయి నమోదు చేశారని రైతు ఆరోపిస్తూ బుధవారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మోదవలస రెవెన్యూ పరిధిలో బంగారురాజుపేట గ్రామానికి చెందిన రైతు కాగితాల సత్యనారాయణ మాట్లాడుతూ మోదవలస గ్రామం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 14/1ఎ లో 1.78 ఎకరాల భూమిని జూన్ 23, 2016న కొనుక్కున్నాను. దీనికి ముటేషన పెట్టుకుంటే రెవెన్యూ అధికారులు వచ్చి సర్వే



తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న బాధిత రైతు, నాయకులు

చేసి 1.76 ఎకరాలకు సంబంధించిన వన్‌బి, పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేశారు. ఆ భూమిని నా అవసరాల నిమిత్తం 26 సెంట్లు, 93, సెంట్లు, 57 సెంట్లుగా విభజించి ముగ్గురుకు 2021లో అమ్మేశాను. వారి ముగ్గురు పేరు మీద రెవెన్యూ అధికారులు పాస్ పుస్తకాలు 1బి అడంగల్ వాటికి సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు కూడా ఇచ్చారు. అయితే ఈ మధ్యకాలంలో మోదవలసలో రీ సర్వే చేసి గ్రామ సచివాలయం దగ్గర నోటీసు బోర్డులో పెట్టిన ఆర్ఆర్ పుస్తకంలో ముగ్గురు పేరు మీద జాయింట్ ఎల్పియం ఇస్తూ 1.78 ఎకరాలకు బదులుగా 1.34 ఎకరాలు భూమి ఉన్నట్లు నోటీసు బోర్డులో పెట్టారు. దీంతో మొత్తం పరిశీలించగా తమ భూమి పక్కనే ఉన్న బాడితబోయిన పెంటయ్యకు 26 సెంట్లు భూమిని బాడితబోయిన నారాయణమ్మ పేరుమీద 26 సెంట్లు భూమిని వారి దగ్గర డబ్బులు తీసుకొని వారి పేరు మీద నా భూమిని రెవెన్యూ సిబ్బంది నమోదు చేశారని ఆరోపించాడు. అనంతరం తహశీల్దార్ రాజారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. తన భూమి తనకు చెందినట్లు విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, విజయనగరం టిడిపి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాణిరాజు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు కరుణానిధిబాబు, టిడిపి నాయకులు పడాల చిన్నారావు, సంఘం సురేష బాలు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

ప్రజాశక్తి- బొండపల్లి

ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. బుధవారం సాయంత్రం బొండపల్లిలో వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు అధ్యక్షతన వైసిపి మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చారని ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం శూన్యమని అన్నారు. సూపర్ సిక్స్‌ను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ సమావేశంలో ఎంపిపి చల్ల చల్లంనాయుడు, వైస్ ఎంపిపి గొండెల ఈశ్వరరావు, బోడసింగి జగదీశ్వరరావు, సాలాపు పెంటంనాయుడు, బండారు బంగారం తదితరులు పాల్గొన్నారు.

మోసానికి కేరాఫ్ చంద్రబాబు

ప్రజాశక్తి- వేపాడ

మోసానికి కేరాఫ్‌గా చంద్రబాబు నిలుస్తారని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను వివరించారు. ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, దీపం, ఉచిత బస్సు వంటి హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ మూకల కస్తూరి, ఎంపిపి దొగ్గ సంత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, నిరుజోగి వెంకటరావు, బోజంకి శ్రీను, ఉగ్గిని శ్రీను, నిరుజోగి శ్రీను, భాస్కర్, అప్పారావు, రుద్ర వెంకటరావు, బీల సతీష్, గండి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలులో కూటమి విఫలం

బొబ్బిలి: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని మూడో వార్డులో బుధవారం



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి గెలిపిస్తే సూపర్ సిక్స్ అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సావు మురళీ, పట్టణ అధ్యక్షులు చోడిగింజ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి- దెంకాడ



నీటి నమూనాలను పరిశీలిస్తున్న అధికారులు

మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డివి మల్లిఖార్జునరావు అన్నారు. మండలంలోని పినతాడివాడ పంచాయతీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. క్లోరినేషన్ రిజిస్టర్, ట్యాంక్ క్లీనింగ్, రిజిస్టర్, శానిటేషన్ రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం గ్రామంలో కాలువలు ఏ విధంగా ఉన్నాయని పరిశీలించారు. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

శృంగవరపుకోట: మండలంలోని ఆలుగుబిల్లి, పట్టణంలోని పుణ్యగిరి లేఅవుట్లును జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, డిపిఒ మల్లిఖార్జునలు బుధవారం పరిశీలించారు. ముందుగా అలుగు బిల్లి గ్రామంలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా తడి చెత్త పొడి చెత్త ప్రజలకు అవగాహనతో పాటు వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ ఉన్నారు. ఎస్.కోట పుణ్యగిరి లేఔట్‌లో జరుగుతున్న జల జీవన్ మిషన్ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి కవిత ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ పనులను వేగవంతంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ఎంపిడిఒ సతీష్, ఇఒపిఆర్‌డి లక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కిషోర్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

సకాలంలో ఎరువులు అందించాలి

ప్రజాశక్తి - గుర్ల

ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో రైతులకు కావలసిన ఎరువులు సకాలంలో అందించాలని, గ్రామాల్లో ప్రజారోగ్యం పట్ల అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపిపి పొట్నూరు ప్రమీల అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఎరువులు నేటి వరకు రైతు సేవా కేంద్రంలో ఎందుకు ఇవ్వడంలేదని ఎక్కడ జాప్యం జరుగుతుందని జమ్ము, చింతలపేట, చింతపల్లిపేట గ్రామ సర్పంచులు అధికారులను నిలదీశారు. గ్రామాల్లో తాగునీరు పైప్‌లైన్లు రిపేర్లు ఉన్నాయని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ దృష్టికి తీసుకువచ్చారు. తల్లికి వందనం పథకం వివిధ షరతులతో తల్లిలను ఇబ్బంది పెట్టి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని, వాటిపై క్లారిటీ ఇవ్వడంలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ పాఠశాలలో పురుగుల బియ్యాన్ని సప్లై చేయడంతో పిల్లలు భోజనాలు చేయడం లేదని తెలిపారు. ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వం స్థానిక సచివాలయంలో అర్జీలు పెట్టుకోవచ్చని తెలిపిందన్నారు. పాఠశాలకు వెళ్లి తనిఖీ చేస్తున్నామని చెప్పారు. రీ సర్వేలో సమస్యలు పెండింగ్ ఉన్నాయని వాటిని సకాలంలో పరిష్కరించాలని, భూమి లేకపోయినా భూమి ఎక్కువగా ఉన్నట్టు చూపించడంతో అన్నదాత సుఖీభవ పథకానికి వారిని అనర్హులుగా చూపిస్తుందని స్థానిక విఆర్వోలు వీటిపై శ్రద్ధ చూపడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కార దిశగా కృషి చేస్తామని తహశీల్దార్ ఆదిలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, వైస్ ఎంపిపి తోట తిరుపతిరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి జిందాల్ సమస్యలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతినిస్తున్న బాధితులు

జిందాల్ యాజమాన్యానికి భూములు ఇచ్చిన రైతుల సమస్యలను కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ దృష్టికి తీసుకెళ్తానని ఎఆర్ఆఎర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళీ అన్నారు. జిందాల్ రైతులను గుర్తించేందుకు ప్రత్యేకంగా నియమితులైన ఆయన బుధవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద జిందాల్ బాధిత రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిందాల్‌కు భూములిచ్చి పరిహారం తీసుకునే విషయంలో నిజంగా మోసపోయిన బాధితులను గుర్తించాలని కలెక్టర్ ఆదేశాలు మేరకు బాధితుల నుంచి వినతులు తీసుకుంటున్నామన్నారు. ఈ ఒక్కరోజే 11 వినతులు అందాయని ఇంకెవరైనా వినతులు ఇవ్వదలుచుకుంటే కలెక్టరేట్‌కు వచ్చి అక్కడ కూడా ఇవ్వవచ్చునని తెలిపారు.

జిందాల్ భూమిని తిరిగి రైతులకు ఇవ్వాలి: సిపిఎం

జిందాల్ భూములను తిరిగి రైతులకు ఇవ్వాల్సిందేనని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బాధితులతో కలిసి ఆయన మాట్లాడారు. భూములిచ్చిన రైతులను మోసం చేసిన జిందాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలకు వచ్చే షేర్ సొమ్మునకు సమాన షేర్ సర్టిఫికేట్లు షేర్ బాండ్లు ఇప్పించాలని కోరారు. జిందాల్ తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తోందని ఆశ పడితే కంపెనీ పెట్టకుండా ఇప్పుడు తమ భూములతో వ్యాపారం చేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బాధితులు మల్లేష్, పార్వతీ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని మల్లెపూడి గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు మాట్లాడుతూ 1999 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 15 కుటుంబాల ఆదివాసీ గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వారందిరికీ పట్టాలు కూడా మంజూరు చేశారన్నారు. ఆ స్థలంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంటి నిర్మాణాలకు సిద్ధమవుతున్న గిరిజనులను కొంత మంది నాయకులు అడ్డుకుంటున్నారన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఈ స్థలంలోనే గిరిజనులు ఇళ్లు కట్టుకునేలా అనుమతులివ్వాలని, గిరిజనులకు శాశ్వత శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, కాశీపతిరాజుపురం, మల్లెపూడి గ్రామాల్లో నివాసం ఉంటున్న గిరిజనుల పిల్లలకు మల్లెపూడిలో ప్రభుత్వ పాఠశాల నిర్మించాలని డిమాండ్ చేశారు. దీనిపై తహశీల్దార్ శ్రీనివాసరావు స్పందిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేలా హౌసింగ్ స్కీమ్‌లు మంజూరు చేస్తామని, సర్వే నిర్వహించి పోడు పట్టాలు మంజూరు చేస్తామని, శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు కె. ఆనంద్, కె.మేరీ, బి. నరసింగరావు, బి. దీప్తి, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

30కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నగరంలోని రైల్వే స్టేషను రోడ్డు ఎం.ఆర్.లాడ్జి ఎదురుగా ముగ్గురు వ్యక్తులు ట్రాలీ సూట్‌కేసులను తోసుకొంటూ వస్తుండగా 1వ పట్టణ పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని, వారి నుండి 30కిలోల గంజాయిని సీజ్ చేసినట్లుగా డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం 1వ పట్టణ పోలీసు స్టేషనులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 22న ముగ్గురు వ్యక్తులు రెండు ట్రాలీ సూట్ కేసులను తోసుకొంటూ రైల్వే స్టేషను రోడ్డులోని ఎం.ఆర్.లాడ్జ్ ఎదురుగా వచ్చేసరికి, అనుమానంతో పోలీసులు సోదాలు చేయగా ఒక ట్రాలీ సూట్ కేసులో 13కిలోలు, మరో సూట్ కేసులో 17కిలోల గంజాయి, నాలుగు ఆండ్రాయిడ్ ఫోన్లు, రెండు కీ ప్యాడ్ ఫోన్లు, రూ.4వేల నగదు లభించిందన్నారు. విచారణలో పట్టుబడిన నిందితులు ఒడిస్సా రాష్ట్రం కలహండి జిల్లా ఉచ్చల గ్రామానికి చెందిన పితాంబర్ నాగ్ (42), బిరుమల గ్రామానికి చెందిన చంద్ర కరున్ (35), చార్ బహల్ గ్రామానికి చెందిన ప్రదీప్ నాయక్ (40)గా గుర్తించామన్నారు. నాలుగో నిందితుడు జయదర్ అలియాస్ తామోతర్‌ను అరెస్టు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని డిఎస్‌పి తెలిపారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి, గంజాయిని సీజ్ చేయడంలో క్రియాశీలకంగా పని చేసిన సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి, టాస్క్ ఫోర్సు సిఐ డి.బంగారుపాప, ఎస్‌ఐలు రామ గణేష్, ఎఎస్ఐ ఎన్.రామలక్ష్మి, కానిస్టేబుళ్ళు ఎన్.గౌరీ శంకర్, బి.శ్రీనులను డిఎస్‌పి అభినందించారు.

ఉన్నత పాఠశాలకు 'హడ్కో' వితరణ

గజపతినగరం: హడ్కో విజయవాడ ప్రాంతీయ కార్యాలయం తమ సిఎస్ఆర్ నిధుల నుంచి స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు రూ.1.75లక్షల విలువ చేసే ఫర్నిచర్‌ను అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీసాల వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. 20 డ్యూయల్ బెంచీలు, 20 'ఎస్' టైప్ కుర్చీలు, 20 టేబుల్స్, 20 లైట్స్, 6 ఫ్యాన్స్ ఇందులో భాగంగా అందజేసినట్లు చెప్పారు. గణిత ఉపాధ్యాయులు ఎన్. కిరణ్ కుమార్ చొరవ వల్ల ఈ సామాగ్రి హడ్కో అధికారులు అందించారని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, గణిత ఉపాధ్యా యులు కిరణ్ కుమార్ కృషిని మండల విద్యాశా ఖాధికారులు ఎస్.విమలమ్మ, బి.సాయి చక్రధర్ అభినందించారు. తమ అభ్యర్థను పరిశీలించి విలువైన ఫర్నిచర్ అందజేసిన హడ్కో ప్రాంతీయ కార్యాలయ అధిపతి బిఎస్‌పి మూర్తికి పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

సాగు భూముల స్వాధీనం అన్యాయం

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి- రామభద్రపురం

ఎంఎస్ఎంఇ పార్కు నిర్మాణం పేరుతో ఎన్నో ఏళ్లుగా గిరిజనులు సాగు చేస్తున్న భూములు స్వాధీనం చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ కొట్టక్కి రెవెన్యూ పరిధిలో కాకర్లవలసలో గిరిజనుల సాగులో ఉన్న సుమారు 365 ఎకరాల భూములను ఎటువంటి ముందస్తు సమాచారమూ ఇవ్వకుండా ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. గిరిజనులకు నష్టం చేకూర్చే నిర్మాణాలను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. పంట పొలాలను నాశనం చేయడం ద్వారా కలిగిన నష్టానికి నష్టపరిహారం కాంట్రాక్టర్, ప్రభుత్వం చెల్లించాలన్నారు. తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి ఎవరైతే హక్కుదారులు ఉన్నారో వారికి ఏ నష్టం జరగకుండా చూడాలని సిపిఎం పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎర్రం నాయుడు, జన్ని తవుడమ్మ, లక్ష్మణ, అప్పారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధులలో కుక్కలు గుంపులుగా తిరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బలిజిపేట రోడ్డులో బుధవారం కుక్కలు దండయాత్ర చేసినట్లు స్వైరవిహారం చేయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కుక్కలు భయంతో పిల్లలను బయటకు పంపించేందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కలు నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.